# లోచన

## బహుజన వ్యాసాలు



చల్లపల్లి స్వరూపరాణి

SBT

# L O C H A N A

Bahujana Vyasalu

**Challapalli Swaroopa Rani**
94403 62433
challapalliswaroopa2012@gmail.com

April 14th, 2020

© Reserved

Cover : Anwar
Page Making: Rajasekhar

Publisher
**Sikkolu Book Trust**
MIG-100, Opp. ZP, APHB Colony,
Srikakulam - 532001.

for copies
99 89 265 444

ISBN *for* e-book
978-81-945712-6-1

Rs. 75/-

# ఇదీ వరస..


| | | |
|---|---|---|
| 1. | రోహిత్ మరణం - కులం, మతం, పితృస్వామ్యం | 13 |
| 2. | పీడితుల నిర్భయ జెండా  భూపతి నారాయణమూర్తి | 18 |
| 3. | ప్రత్యామ్నాయ సంస్కరణవాది నాసరయ్య | 27 |
| 4. | సాంస్కృతిక యోధుడు సి.వి | 31 |
| 5. | ఉద్యమాన్ని  శ్వాసించిన  షేక్ మసూద్ బాబా | 35 |
| 6. | భారత కార్మికోద్యమ పితామహుడు నారాయణ్ మేఘాజీ లోఖాండే | 40 |
| 7. | సంకెళ్ళను ఛేదించిన బతుకులు | 45 |
| 8. | బ్లాక్ బుక్- టోనీ మారిసన్ | 50 |
| 9. | మట్టి గుబాళింపుల దళిత యీస్తటిక్స్ | 55 |
| 10. | వెండి తెరపై నల్ల చందమామ 'కాలా' | 63 |
| 11. | బులుగు మంట రగిల్చిన పెరుమాళ్ళు | 66 |
| 12. | అసమానతకు శాశ్వత చిరునామా 'మనుస్మృతి' | 70 |
| 13. | అచ్చమైన దళిత డిక్షన్ 'పలాస' | 75 |
| 14. | గొట్టిపాడు దళిత స్త్రీల పోరాట స్ఫూర్తి | 83 |
| 15. | మతం- రాజ్యం- స్త్రీలు | 89 |
| 16. | నెరవేరని దళిత రాజకీయ ఆకాంక్షలు | 93 |
| 17. | విగ్రహం మాట్లాడే భాష | 99 |
| 18. | ప్రత్యామ్నాయ సాంస్కృతిక విప్లవ క్షేత్రం - మహాత్మా రావణ మైదానం | 105 |
| 19. | అనధికార మరణ  శాసనం వెలి | 112 |

| | | |
|---|---|---|
| 20. | ప్రబుద్ధ భారత్ | 119 |
| 21. | ఔను యీ దేశం మాది | 128 |
| 22. | విముక్తి కోసం బౌద్ధధర్మం | 132 |
| 23. | బౌద్ధం - జాతీయత | 137 |
| 24. | ఫాసిస్టులకు 'పరువు' ఎక్కడిది? | 143 |
| 25. | అడవి ఆమె ఇల్లు | 148 |
| 26. | పురాణాలు-చరిత్ర | 154 |
| 27. | జీవం నిండిన గని నల్లమల | 158 |
| 28. | మనువాద మీడియా | 161 |
| 29. | దేవుళ్ళను బహిష్కరించాలి | 165 |
| 30. | ఇప్పుడీ దేశం పేరు షాహీన్ బాగ్ | 172 |
| 31. | ఎక్కడైనా పితృస్వామ్యపు రంగు బ్రాహ్మణవాదమే | 179 |

# రోహిత్ మరణం - కులం, మతం, పితృస్వామ్యం

*"తన ప్రేమలోనూ, ద్వేషంలోనూ స్పష్టంగా లేనివాడు*
*తన కాలాన్ని ప్రభావితం చెయ్యలేడు"*

**- డా. బి. ఆర్. అంబేడ్కర్**

**రో**హిత్ ప్రజలను, ప్రకృతిని, నక్షత్రాలను మనసారా ప్రేమించాడు. అసమానత్వాన్ని, వివక్షను అంతే స్పష్టంగా ద్వేషించాడు. మనుషులను ఓట్లుగా, వస్తువులుగా కుదించే సమాజ లొసుగుల కందిరీగల పుట్టను కదిలించాడు. కొందరికి జీవితం వడ్డించిన విస్తరి అయితే మరికొందరికి బతుకే ఒక శాపంగా ఉండడాన్ని ప్రశ్నించాడు. కొన్ని కులాలను పుట్టుకతోనే నేరస్త జాతులుగా భావించే వలసవాద ధోరణిని తిరస్కరించాడు. వ్యవస్థలో అడగకుండానే అన్ని హామీలను పొందిన వారు హుందాగా, నింపాదిగా ఉంటే తాను మాత్రం పరుగెడుతూనే ఉన్నాడు. పరుగెత్తి పరుగెత్తి పాతికేళ్లకే అలిసిపోయాడు. రోహిత్ నిశ్శబ్దంగా నిష్క్రమించాడు.

దళిత, బహుజన అస్తిత్వ ఉద్యమాలు స్తబ్దతకులోనై ఒక రకమైన నిష్క్రియాపరత్వంలోకి వెళ్లిపోయిన సందర్భంలో రోహిత్ అన్ని నిశ్శబ్దాల్ని పటాపంచలు చేస్తూ తాను మాత్రం నిశ్శబ్దంగా వెళ్లిపోయాడు. అతని నిష్క్రమణ విద్యార్థి లోకంతో పాటు దళిత బహుజన ఉద్యమ శ్రేణుల ప్రజా ఉద్యమాలలో కూడా సునామి సృష్టించింది.

జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్టు హేతువాదాన్ని మానవతావాదాన్ని ముందుకు తీసుకెళ్లేవిగా ఉండి, విద్యార్థుల విశాల ప్రాపంచిక దృక్పథానికి వాకిళ్లు తెరవవలసిన విశ్వవిద్యాలయాలలో దాగున్న అగ్రహారాలను బయటి ప్రపంచానికి చూపించాడు

రోహిత్. నాణ్యతా ప్రమాణాల రీత్యా దేశంలోనే అగ్రగామిగా నిలిచి, ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ కూడా కులం విషయంలో సగటు భారతీయ గ్రామానికి తీసిపోదని రోహిత్ చెప్పకనే చెప్పాడు. సెంట్రల్ యూనివర్శిటీలో గత కొంతకాలంగా చాలా ఆత్మహత్యలు జరిగాయి. ఒక రకంగా అవన్నీ అక్కడి మనువాదం చేసిన హత్యలే! అగ్రకుల యువకుడి చేతిలో ప్రేమ పేరుతో మోసపోయిన దళిత విద్యార్థిని సునీతనుంచి, అధ్యాపకుల కుల వివక్షకు, వేధింపులకు గురై దాన్నుంచి బయట పడలేని నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సెంథిల్ కుమార్ వరకు అందరూ బ్రాహ్మణ వాద కుట్రలకు బలైపోయిన వారే! కానీ వారంతా ఈ రుగ్మతను తమ వ్యక్తిగత సమస్యగా భావించినట్లు అనిపిస్తుంది. కానీ రోహిత్ ఒక అంబేడ్కరైట్, బుద్ధిస్ట్. అక్కడ దళిత విద్యార్థులకు అండగా నిలబడుతూ బ్రాహ్మణీయ భావజాలానికి సవాలు విసురుతూ వస్తున్న అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో క్రియాశీల సభ్యుడు, నాయకుడు. అలాంటి రోహిత్ ఆత్మహత్య అతని వ్యక్తిగత వైఫల్యం కాదు. ఇది పైకి కనిపించని అనేక ఆత్మహత్యలకు, హత్యలకు దృశ్యరూపం.

రోహిత్ అంబేడ్కరిజాన్ని, బౌద్ధాన్ని, మార్క్సిజాన్ని తన జీవితానుభవంలోంచి సీరియస్‌గా అధ్యయనం చేసి అన్వయించుకున్న వాడు. చదువులో కూడా చురుకైన వాడని అతని ప్రొఫైల్ చెబుతూనే ఉంది. పుట్టుకతో సంబంధంలేని ప్రతిభ రోహిత్‌ది. బతుకుపోరు బాటలో రాటుదేలిన జ్ఞానం అతని సొత్తు. అతనికి చదువంటే మంచినీళ్ల ప్రాయం. అగ్రహారం వంటి సెంట్రల్ యూనివర్శిటీలో వెలివాడ సూరీడై ప్రకాశించాడు. పూలే, అంబేడ్కర్ అందించిన సామాజిక ఉద్యమ స్ఫూర్తితో సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ఉన్నత విద్యావ్యవస్థలో చాపకింద నీరులా ఉండే బ్రాహ్మణవాదాన్ని ఫేస్‌బుక్‌లో ఎండగడుతూ ఉరకలెత్తే చైతన్య ప్రవాహమై సాగిపోయాడు రోహిత్.

1994లో ప్రారంభమైన నాటినుంచి అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మనువాద అధ్యాపకులు, పరిపాలక సిబ్బందికి గొడ్డలిపెట్టుగా ఉంటూ దళిత విద్యార్థులను వేధించే వారిని ఎప్పటికప్పుడు నిలదీస్తూనే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే మొదటితరం విద్యావంతులు తెలుగు మీడియం చదువుల వలన అక్కడి చదువుల వత్తిడితోపాటు కుల వివక్షను తట్టుకోలేక

# ఉద్యమాన్ని శ్వాసించిన షేక్ మసూద్ బాబా

శ్రీకాకుళ సాయుధ పోరాట యోధుడు, ప్రజా ఉద్యమాల పట్ల గొప్ప ప్రేమతో ఆశతో ప్రత్యామ్నాయ రాజకీయాలు నిర్మించడానికి తపన పడిన షేక్ మసూద్ బాబాగారు 2018 ఆగస్ట్ అయిదో తేదీన తీవ్ర అనారోగ్యంతో విజయవాడలో మృతి చెందారు. ఆయన జీవితం గొప్ప నిజాయితీకి, నిబద్ధతకి నిలువెత్తు ప్రతీక. 'బాబా'గా అందరికీ చిరపరిచితుడైన మసూద్ బాబా 1946లో అమీనాబీ, మస్తాన్ దంపతుల మొదటి బిడ్డగా జన్మించారు. వీరి స్వస్థలం గుంటూరు జిల్లా రొంపిచర్ల. ఆయన తల్లిదండ్రులు జీవనోపాధిని వెదుక్కుంటూ వచ్చి బాబాగారి చిన్నతనంలోనే విజయవాడలో స్థిరపడ్డారు. ఆయనకి నలుగురు తమ్ములు, ఇద్దరు చెల్లెలు. వారి తోబుట్టువులు, బంధువులు విజయవాడ, మచిలీపట్నం పరిసర ప్రాంతాలలోనే ఎక్కువగా స్థిరపడ్డారు. అయిదో తరగతి వరకూ చదువుకున్న ఆయన చిన్నతనం నుంచే మార్క్సిజం పట్ల అభిమానాన్ని పెంచుకున్నారు. ఆయన చిన్నతనంలో విజయవాడ సూర్యారావుపేటలోని బెల్లం శోభనాద్రి గ్రంథాలయంలో సోవియట్ పుస్తకాల్లో బొమ్మలు చూడ్డానికి వెళ్లేవారు. ఆ విధంగా క్రమంగా ఆయన కమ్యూనిస్ట్ సాహిత్యం చదవడానికి అలవాటు పడ్డారు. ఆయన మొదట వివాహం చేసుకోవాలని అనుకోకపోయినా తర్వాత ఉద్యమంలో నష్టపోయిన కుటుంబానికి చెందిన బోయ కులానికి చెందిన 'శీలం సౌదామణి' గారిని 1987లో వివాహం చేసుకున్నారు. వారి పెళ్లికి ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకులు కొల్లా వెంకయ్య పెద్దగా వ్యవహరించారు.

మసూద్ బాబా టాక్సీ డ్రైవరుగా తన కెరియర్ ప్రారంభించి కార్మిక సంఘాలలో క్రియాశీలంగా ఉండేవారు. విజయవాడలో 'చిన్నకార్ల వర్కర్స్ యూనియన్' ఒక ముఖ్యమైన కార్మిక సంఘంగా గుర్తింపు పొందింది. ఆయన ఉమ్మడి కమ్యూనిస్ట్ ఉద్యమం చీలినాక ఏర్పడిన సిపిఐ(ఎంఎల్)లో కె.జి. సత్యమూర్తి (శివసాగర్), కొండపల్లి సీతారామయ్య, రవూఫ్, నాగభూషణం పట్నాయక్, ముక్కు సుబ్బారెడ్డి,

మామిడి అప్పలసూరి, చౌదరి తేజేశ్వరరావు మొదలైన ప్రముఖ నాయకులతో కలిసి పనిచేశారు. 1967-68 సంవత్సరాలలో నక్సల్బరీ సంఘీభావ కమిటీ ఏర్పడినప్పుడు బాబాగారు క్రియాశీలంగా పనిచేసిన 'చిన్నకార్ల వర్కర్స్ యూనియన్' శ్రీకాకుళ పోరాటంలోకి వెళ్లింది. ఉద్యమంలో చేరినప్పటికి ఆయనకి పద్దెనిమిదేళ్లు మాత్రమే. ఆయన శ్రీకాకుళం ఉద్యమాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో తూర్పు గోదావరి జిల్లాలో తిరుగుతున్నపుడు అరెస్టయ్యారు. బాబాగారు పార్వతీపురం కుట్ర కేసులో 77వ నిందితుడిగా అరెస్టై విశాఖపట్నం, కోరాపుట్, జయపూర్, మల్కన్‌గిరి, విజయవాడ, బందరు మొదలైన జైళ్లలో ఎనిమిదేళ్లు రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించాక పోలీసుల నిర్బంధాల వలన సుమారు ఇరవై సంవత్సరాలు రహస్య జీవితం గడిపారు. విశాఖ జైలులో ఉన్నప్పుడు కెజి సత్యమూర్తి గారితో ఆయనకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. బాబా శివసాగర్‌కి వీరాభిమాని. ఉద్యమం బయట ఎక్కువమందికి ఆయన శివసాగర్ మిత్రుడుగానే పరిచయం. ఆయనకి ప్రజల వైద్యుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్, సామాజిక ఉద్యమకారుడైన డాక్టర్ ఎం. ఎఫ్. గోపీనాథ్‌తో కూడా మంచి స్నేహ సంబంధాలున్నాయి.

అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో చారుమజుందార్‌ను గుత్తికొండ బిలంలో కలుసుకోవడం దగ్గర నుంచి కొండపల్లి సీతారామయ్యతో కల్సి పీపుల్స్ వార్ పార్టీని స్థాపించిన నక్సల్బరి సిద్ధాంతకర్త, మహాకవి కె.జి. సత్యమూర్తి (శివసాగర్) సాహచర్యంలో మసూద్ బాబా మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అధ్యయనం చేశారు. అప్పట్లో జైలులో ఖైదీలకు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. అరకొర సౌకర్యాల వలన ఖైదీలుగా ఉన్నవారిని అనారోగ్యం పట్టి పీడించేది. బాబా, సత్యమూర్తి ఇతర మిత్రులతో కలిసి జైలు సంస్కరణల కోసం లోపలనుంచి ఉద్యమం చేశారు. ఖైదీలు తమ వంట తామే చేసుకునే అవకాశం కల్పించి, జైలులో లైబ్రరీ ఏర్పాటు చెయ్యాలనే తమ డిమాండును పోరాడి సాధించుకున్నారు.

మసూద్ బాబా మార్క్సిస్ట్ ఉద్యమం పట్ల కొండంత విశ్వాసంతో, గొప్ప విప్లవ స్వప్నంతో నడిచే ఉద్యమంలా ఉండేవారు. ఆయనకు చాలాకాలం వరకు వర్గ స్పృహ తప్ప కుల నిర్మూలన స్పృహ ఉండేది కాదు. ఎప్పుడూ తనని తాను ఒక కార్మిక వర్గపు ఉద్యమకారుడిగానే భావించే బాబా నలభై ఏళ్లు దాటాక 'సౌదామణి'గారిని వివాహం చేసున్నారు. అయితే తమ బంధువులు ముస్లిం 'నిఖా' పద్ధతిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యబోతే సున్నితంగా తిరస్కరించారు. ముస్లింగా

# సంకెళ్లను ఛేదించిన బతుకులు

**ఆ**త్మకథ అనేది సాధారణంగా 'గొప్ప'వారికి, అందునా మగవారికి సంబంధించిన విషయంగా భావిస్తారు. స్త్రీలు, వారిలో కూడా దళిత స్త్రీలు ఆత్మకథలు రాయడం అనేది విచిత్రంగా అనిపించినప్పటికీ అటువంటి ప్రక్రియ ఇతర భాషల కంటే మరాఠీలోనూ, తమిళంలోనూ కనిపిస్తుంది. మరాఠీలో దయాపవార్ '*బలూతా*', శరణ్ కుమార్ లింబాలే '*అక్కర్ మాశీ*', శంకర్ రావు ఖరత్ '*తరాల్, అంతరాల్*' వంటి ఆత్మకథలు భారతీయ సాహిత్యంలో ఓ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. మరాఠీ దళిత స్త్రీలలో కుముద్ పవాడే, శాంతాబాయి కాంబ్లే, ఊర్మిళా పవార్ వంటి వారి ఆత్మకథలు పురుషుల ఆత్మకథల కంటే భిన్నంగా ఉంటాయి. శర్మిలా రెగే ఈ ఆత్మకథల్ని 'వాంగ్మూలాలు' అని పేర్కొన్నారు. దళిత పురుషుల ఆత్మకథలలో స్త్రీలను త్యాగపూరితమైన తల్లులుగా, భార్యలుగా చిత్రిస్తే, దళిత స్త్రీల ఆత్మకథలు స్త్రీలను సామాజిక చైతన్యానికి, మార్పునకు దోహదపడే వారిగా చిత్రించాయి. ఈ ఆత్మకథలు అన్నింటిలోనూ అంబేడ్కర్ ప్రముఖ పాత్రగా, ఓ కేంద్ర బిందువుగా ఉండడం ఓ ప్రత్యేకత. మహారాష్ట్ర దళిత స్త్రీలలో అంబేడ్కర్ ఉద్యమ ప్రభావంతో పాటు బౌద్ధులుగా మారిన కుటుంబాలకు చెందిన స్త్రీలు మాత్రమే ఆత్మకథలు రాయడం విశేషం. హిందూ మతాన్ని వీడకుండా సామాజిక, ఆర్థిక రంగాలలో పెత్తందారీ కులాల బానిసత్వంలో ఉన్న మాతంగ కులాల స్త్రీలు పెద్దగా విద్యావంతులు కాకపోవడమే కాకుండా వారి చైతన్య స్థాయి మహర్ల కంటే తక్కువగా ఉండడం వలన వారు సృజన రంగానికి దూరంగా ఉన్నారు.

బేబీ కాంబ్లే పూనా సమీపంలో ఓ కుగ్రామంలో పుట్టి, పెరిగి అంబేడ్కర్ భావజాల ప్రభావంతో తన జీవితాన్ని వెలిగించుకోవడమే కాకుండా సమాజంలో ఒక

ముఖ్యమైన వ్యక్తిగా ఎదిగారు. ఎలిమెంటరీ స్కూల్ వరకు చదువుకున్న ఆమె భృతి కోసం తన భర్తతో కలిసి చిన్నచిన్న వ్యాపారాలు చేసి తన పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. పేద దళిత విద్యార్థుల కొరకు అంబేడ్కర్ భావజాలంతో నడిచే ఒక పాఠశాలను స్థాపించి పూర్తిగా ప్రజల మధ్యనే జీవించి బేబీ కాంబ్లే 2012లో మరణించారు. బేబీ కాంబ్లే 1960వ దశకంలో తన జీవితానుభవాలను చిత్తు కాగితాలలో రాసుకుని ఎవరికీ కనిపించకుండా ఇంటి అటక మీద భద్రంగా దాచిపెట్టారు. మహారాష్ట్రలో ఓ పరిశోధకురాలిగా క్షేత్ర పర్యటనకు వచ్చిన డా. మాక్సీన్ బెర్న్ స్టీన్‌కు బేబీ తారసపడ్డారు. ఆమెకు సమాచార సేకరణలో ఎంతో తోడ్పడిన బేబీ కాంబ్లే ఆలోచన సరళి, ఆమె చెప్పే విషయాల పట్ల ఆసక్తి కనబరిచిన బెర్న్‌స్టీన్ బేబీని ఆత్మకథ రాయాల్సిందిగా ప్రోత్సహించారు. దీంతో అప్పటికే నోట్స్ రాసి పెట్టుకున్న పేపర్లను బేబీ కాంబ్లే, బెర్న్‌స్టీన్‌కు చూపించగా ఆమె వాటికి కొంత మెరుగులు దిద్ది మరాఠీలో 'స్త్రీ' అనే పత్రికలో ముద్రింపచేశారు. తర్వాత 1986లో ఈ ఆత్మకథ '*జీనా అమూచ*' పేరుతో పుస్తకరూపం సంతరించుకుంది. తర్వాత మాయా పండిట్ ఈ పుస్తకాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించి 2008లో '*ద ప్రిజన్స్ వి బ్రోక్*' పేరుతో ముద్రించారు. ఇంగ్లిష్ అనువాదం చేసే క్రమంలో మాయా పండిట్, బేబీ కాంబ్లేని ఇంటర్వ్యూ చేసి పుస్తకంలో లేని మరికొన్ని అంశాలపై ఆమె నుంచి సమాచారాన్ని సేకరించారు. ఈ ఇంటర్వ్యూ నిజానికి పుస్తకంలోని అస్పష్టతను కొంత పూడ్చిందనవచ్చు.

ఈ పుస్తకంలోని మొదటి భాగంలో మహారాష్ట్రలోని కులవ్యవస్థలో మహర్ల స్థానం, వారి జీవితం చుట్టూ అలుముకున్న అంటరానితనం, వివక్ష, పేదరికం, సామాజిక కట్టుబాట్ల పరంగా ఉన్న వెనుకబాటుతనం, మూఢాచారాలు, నమ్మకాలు, వారు పెత్తందారీ కులాల చేతిలో తరతరాలుగా అనుభవించిన బానిసత్వం వంటి అంశాలను పూసగుచ్చినట్లు రచయిత్రి వివరించారు.

కడుపు నింపుకోవడం కోసం చచ్చిన గొడ్డు మాంసం తినడం, ఈ క్రమంలో వారు కుక్కలతోనూ, పిల్లులతోనూ పోటీపడవలసిన దురవస్థ ఎంత ఘోరంగా ఉంటుందో బేబీ కాంబ్లే కళ్లకు కట్టినట్టు వివరించారు. ఆమె మహర్ వాడ రూపురేఖలు వివరిస్తూ మహర్ల పూరి గుడిసెలు, వాటిలో ఒక్కో కుటుంబానికి గంపెడు సంతానం, చాలీచాలని చిరిగి పేలికలైపోయిన బట్టలతో, చింపిరి జుట్టు, చీమిడి కారే ముక్కులతో

# వెండితెరపై నల్ల చందమామ 'కాలా'

దశాబ్దాలుగా ఒకానొక కుల సంస్కృతి, భాష, కట్టుబాట్లే తెలుగు సినిమా నిండా ఆక్రమించాయి. ఇటీవల మళ్లీ ఆ కులానికి పోటీగా ఇతర కులాల సంస్కృతి చిన్నగా సినిమాలలో చొప్పిస్తున్నా మొత్తానికి సారాంశం ఒక్కటే! ఆధిపత్య సంస్కృతి, భాష, ఆయా కులాల గొప్పదనం, యధాతథవాదం తప్ప దృక్పథాలలో మార్పేమీ లేదు. వారి సినిమాలలో స్త్రీ పాత్రలకైతే పూచిక పుల్లకున్న విలువ ఉండదు. స్త్రీ పాత్రలు కూడా తమ కుల ప్రయోజనాలతో పాటు పురుష ప్రయోజనాలనే కాపాడుతుంటాయి. ఏ కులకాంతలు ఏ ధర్మం నెరవేర్చాలో వారే చెబుతుంటారు అమాయకంగా... అందంగా.

పా.రంజిత్ సినిమాకు 'కాలా' అనే పేరు పెట్టడం దగ్గర నుంచి ఈ సినిమాలోని అన్ని సన్నివేశాలలో దళిత గ్రామర్‌ని ప్రవేశ పెట్టాడు. ఈ సినిమా మనువాద మూస భావాలను కాలితో తన్నడమే కాదు సమకాలీన రాజకీయ పరిస్థితిపైన అంబేడ్కరైట్ చూపును కళ్లారా చూపించింది. నలుపు, బులుగు రంగుల్ని సెల్యూలాయిడ్‌పైన అద్దిన సినిమా 'కాలా'. ఈ సినిమాకు దర్శకుడి దృక్పథమే హీరో అని చెప్పాలి. 'నేల నీకు అధికారం, నేల మాకు జీవితం' అనే రజనీ డైలాగ్‌తో నేలతో ముడిపడిన అధికార సంబంధాలను సూటిగా తేల్చి చెప్పాడు. 'దేశభక్తి' పేరున తెల్లతెల్లగా జరుగుతున్న సమస్త దుర్మార్గంపై పెద్ద డబ్బాడు నల్ల రంగును పోశాడు రంజిత్. 'నలుపు శ్రమ జీవుల వర్ణం...మా వాడకొచ్చి చూడు, మురికంతా ఇంద్రధనస్సులా కనిపిస్తుంది' అంటూ అసలైన దళిత సౌందర్యాన్ని 'కాలా' గట్టిగానే ప్రదర్శించాడు. బొంబాయి మురికివాడ 'ధారావి'లో దళిత శ్రమ జీవుల ఉనికిని కాపాడే ప్రయత్నంలో దళితుడు వీరయ్య పెత్తందారుల చేతిలో హత్యకు గురవుతాడు. ఆ సాహసోపేతమైన

వారసత్వాన్ని కొనసాగిస్తూ కుల, మత రాజకీయాలు సాగించే మనువాదులకు అడుగడుగునా కొరకరాని కొయ్యగా మారిన కథానాయకుడు 'కరికాల' (రజనీ) దళిత ధిక్కారానికి ప్రతీక. ప్రశ్నించేవారిని నేరస్తులుగా, రౌడీలుగా ముద్రవేసినట్టే పాలక కులాలు, వర్గాల ధోరణులను ఎండగడుతూ తన ప్రజలకు మాత్రం నోట్లో నాలుకలా ఉండే 'కాలా'కు కూడా అదే గుర్తింపు. అయినా తన వాడకు ఆయనే తిరుగులేని మహారాజు.

ఈ సినిమాలో రోహిత్ పోలికలున్న అబ్బాయి కథానాయకుడు రజనీ చిన్న కొడుకు లెనిన్‌లో కనిపిస్తాడు. భారతి అనే అమ్మాయిది లెనిన్ ప్రేమికురాలిగా, ఉద్యమ సహచరిగా డైనమిక్ రోల్. ఆమె పోలీసులు తనపై బట్టలు తొలగించి అపహాస్యం చెయ్యబోతే మూస యువతి పాత్రలాగా ముడుచుకుపోయి ఏడుస్తూ కూర్చోకుండా తిరగబడి వారితో ప్రాణాలకు తెగించి పోరాడి చనిపోతుంది. ఈ అమ్మాయి పాత్రని బాబాసాహెబ్ పుట్టి పెరిగిన మహారాష్ట్ర నీలి డైనమైట్‌గా సిసలైన దళిత ధిక్కారిగా మలిచాడు రంజిత్. ఇతర స్త్రీ పాత్రలైన స్వర్ణ, జరీన సొంత వ్యక్తిత్వంతో మెరుస్తూ కనిపిస్తాయి. స్వర్ణ ఆత్మగౌరవాన్ని చాటే సగటు దళిత గృహిణి అయితే, జరీనా రాజకీయ చైతన్యం కలిగి ఒకనాటి తన నివాసమైన 'ధారావి' మురికివాడ పైన, అక్కడి దళిత సమూహాల పట్ల సహజమైన ప్రేమను, సహానుభూతిని ప్రదర్శిస్తూ వారితో మమేకమయ్యే విద్యావంతురాలైన అర్బన్ ముస్లిం స్త్రీ పాత్ర... సింగిల్ మదర్. కాళ్లు పట్టించుకుని తన అహాన్ని సంతృప్తి పరుచుకునే పెత్తందారీ వర్గపు ప్రతినిధియైన ప్రతినాయకుడికి ఎదుటివారికి షేక్ హాండ్ ఇవ్వడంలో ఉండే సమానత్వ భావనేంటో అర్థం చేయిస్తుంది జరీనా. ఈమె స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసే వ్యక్తి కావడంతో కథానాయకుడు 'కాలా' ఈమె పనితీరును శంకిస్తాడు.

'కాలా' సినిమాలో ర్యాప్ సంగీతం, సందర్భానుసారమైన పాటలతో సినిమాకు హైలైట్‌గా నిలిచింది. నేపథ్య సంగీతం శరీరం మీద వెంట్రుకలు నిక్కబొడుచుకునేలా ఒక గంభీరమైన ధ్వనితో సినిమా అయిపోయాక కూడా మనల్ని వెంటాడే మంటలా ఉంటుంది. కథానాయకుడు 'కాలా' టేబుల్ మీద ఆనంద్ నీలకంఠన్ 'అసురుడు' నవల కనిపిచడం, చాలా సన్నివేశాలలో బుద్ధుడు, పూలే, అంబేడ్కర్‌ల చిత్రపటాలు గోడల మీద కనిపిచడం దర్శకుడు రంజిత్ ఆలోచనల వెనక ఎవరున్నారో పరోక్షంగా

# గొట్టిపాడు దళిత స్త్రీల పోరాట స్ఫూర్తి

**భా**రతదేశం గ్రామాల్లో నివసిస్తుందని గాంధీగారంటే ఏమో అనుకున్నాం. పెదగొట్టిపాడు భారతీయ గ్రామానికి పర్యాయ పదం, నిలువెత్తు ప్రతినిధిలాంటిది. దాని రంగు, రూపు, వాసన కుల భూస్వామ్యం. గ్రామం తల వాకిట్లో కమ్మ పెత్తందారీ కులం నివసిస్తుందనడానికి అక్కడ పెద్ద పెద్ద భవంతులు, మండువా లోగిళ్లే సాక్ష్యం. కల్ర పెత్తనానికి చిరునామాలుగా ఉండే అరుగులు. నెయ్యి కిందపడితే నాలికతో అద్దుకోవచ్చన్నట్టు అంతటా పరుచుకున్న గచ్చు. కంటికి కనిపించని నేల. అందుకే మట్టి వాసన వెలిసిపోయింది కాబోలు. దొరతనం కాలం చేస్తే ఆర్భాటంగా తీసుకెళ్లి కాల్చుకోడానికి ఖరీదైన స్మశాన వాటిక. అన్నీవుండీ అదో కాంక్రీటు జంగిల్ లాంటిదే! ఇనప్పెట్టిలాంటి ఆ వీధుల నిండా తిష్టవేసుకున్న ఏదో వెలితి. కొత్తగా అక్కడికొచ్చినోడు పలానా వాళ్ల ఇల్లెక్కడా? అని అడగడానికి పిట్ట అలికిడి కూడా ఉండదు. కళ్లాల్లో ఆరబోసిన మిరపకాయ పొగరు వాసన అక్కడ గుప్పుమంటుంది - అచ్చం కుల దురహంకారంలాగే!

గొట్టిపాడు కాంక్రీటు జంగిల్‌ని దాటి ముందుకెళ్తే దానికి పూర్తిగా భిన్నమైన దృశ్యం. రెండో భారత దేశం లాంటి ఎస్సీ కాలనీ! అక్కడన్నీ పూరి గుడిసెలే! కూలిపోడానికి సిద్ధంగా ఉన్న మట్టి గోడలు. అక్కడక్కడా అగ్గిపెట్టెల్లాంటి సర్కారీ పక్కా ఇళ్లు కట్టిచ్చినోడి మనసులాగా. రెండు దృశ్యాలనూ కిమ్మనకుండా కన్నార్పకుండా చూస్తున్నట్టుండే ఏసయ్య చర్చి. కాస్త ముందుకెళ్తే ఎదురుగా కనిపిస్తున్న వైరుధ్యాల్ని వేలెత్తి చూపిస్తున్నట్టుండే బాబా సాహెబ్ అంబేడ్కర్ బొమ్మ. ఆయనతో ఏ మాత్రం సంబంధం లేకపోయినా ఇరువైపులా రెండు దిష్టిబొమ్మలు. వాళ్లకి మాలపల్లెతో పనేంటో పాపం పెట్టుకున్న వెర్రిబాగులోళ్లకి కూడా తెలవదు. అంబేడ్కర్ బొమ్మ దగ్గరే రచ్చబండ, కమ్యూనిటీ హాలు. అక్కడెప్పుడూ మనుషుల సందడే!

మాల, మాదిగ కులాలు కలిసి సుమారు వెయ్యి గడప ఉన్న పెద గొట్టిపాడు దళిత వాడ చైతన్యానికి మారు పేరు. వారు తమపై తరతరాలుగా రుద్దిన అంటరానితనాన్ని ధిక్కరించి ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. ఉన్న దాంట్లో తింటూ తెల్ల గుడ్డలేసుకుని తలెత్తి తిరుగుతున్నారు. గొట్టిపాడు మాల మాదిగ కుర్రోళ్లు ఒక్కొక్కరు ఒక చురకత్తి అనొచ్చు. ఎవరన్నా చులాగ్గా 'అరే, ఒరే' అంటే వాళ్లకి నషాళానికంటుకుంటది. వారు అంబేడ్కర్ యువజన సంఘాన్ని ఏర్పాటు చేసుకుని అంబేడ్కర్ ఇచ్చిన స్ఫూర్తిని అందిపుచ్చుకుని గ్రామంలోని పెత్తందారుల ఆగడాలను ప్రశ్నిస్తున్నారు. అర్హులైనవారికి వృద్ధాప్య, వితంతు ఫించన్లు రాకపోతే అధికారులను నిలదీస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ ప్లాన్ నిధులు దారి మళ్లింపు పైన ఆరా తీస్తున్నారు. 'నీరు-చెట్టు' పేరుతో మాదిగల చెరువుని కబ్జా చెయ్యడంపైన అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తూ జన్మభూమి కమిటీల పేరుతో కమ్మ దొరలు చేస్తున్న ఆగడాలను ఎండగడుతున్నారు. కమ్మ కులస్తులు కరెంటు పన్ను, ఇంటి పన్ను కట్టకుండా మాల మాదిగలు కట్టిన పన్ను డబ్బుతో తమ వీధుల్లో సిమెంట్ రోడ్లు వేసుకోవడాన్ని ప్రశ్నించారు. ఇంటికిద్దరూ ముగ్గురూ మొగపిల్లలుంటే అందరూ చదువుకుంటూ ఖర్చులకోసం సెలవుల్లో పెయింటింగ్, ఆటో నడపడం, కరెంట్ పని, బేల్దారి పనీ వంటి ఆ పనీ ఈ పనీ అని లేకుండా మర్యాదకరమైన పనులన్నీ చేస్తారు. దాదాపు అందరికీ టూ వీలర్ బళ్లు, చేతిలో సెల్ ఫోన్లు ఉన్నాయి. రెండేళ్ల కిందట (2016) గుంటూరులో కట్టుబడి పనికెళ్లి ప్రమాదంలో మట్టిపెళ్లలు విరిగిపడి ఏడుగురు మొగపిల్లలు చనిపోయారు. పనులకోసం ఆడా మగా ఎక్కడికైనా వలసెళ్తారు కానీ కమ్మోళ్ల ఇళ్లల్లో పాచిపనులు, వెట్టి పనులకు మాత్రం ఎవరూ వెళ్లరు.

డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి ఒకటో తేదీ మధ్యాహ్నం వరకు కమ్మలు మాల పల్లెపై దాడి చెయ్యడానికి ఆ దళిత వాడ చైతన్యం, కమ్మ కుల పెత్తనాన్ని వారు అంగీకరించకపోవడమే అసలు కారణం. డిసెంబర్ 31 అర్ధరాత్రి మాల యువకులు బైకులపై వెళ్లి కమ్మ వీధుల్లో ఆడ పిల్లలు ముగ్గులు వేస్తుంటే అల్లరి చేశారనే నెపంతో వారిని కొట్టి మరసటి రోజు క్షవరం చేయించుకోడానికి మంగలి షాపుకెళ్లిన యువకుడిని చితకబాది, తర్వాత చర్చి కెళ్తున్న స్త్రీ, పురుషులపై దాడి చేసి అదేమని అడిగిన ఆడవాళ్లకు లుంగీలెత్తి చూపించి అసభ్యంగా ప్రవర్తించి,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Lochana**

* * *